ఊరక్కడ.. వార్డులు ఇక్కడ !

- సమస్యలు విన్నవించుకోవాలంటే 12 కిలోమీటర్లు వెళ్లాల్సిందే
- యనమదుర్రులోని 1, 2 వార్డు ప్రజల ఇబ్బందులు



భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామ పంచాయతీ

భీమవరం అర్బన్: ఏళ్లు గడుస్తున్నా...పార్టీలు మారుతున్నా.. గ్రామాల దుస్థితి మారడం లేదు. దేశానికి పట్టుకొమ్మలైనా పల్లెలు సమస్యల వలయంలో చిక్కుకుంటున్నాయి. దీంతో ప్రజలు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం మండలంలోని కాళీపట్నం రోడ్డులో యనమదుర్రు గ్రామంలో 12 వార్డులు ఉన్నాయి. సుమారు 6 వేల మంది వరకు జనాభా ఉన్నారు. ఈ గ్రామానికి ఆనుకుని ఉన్న యనమదుర్రు డ్రెయిన్ ఆనుకుని అవలి వైపు 1,2 వార్డులు కట్టావారిపాలెం , డేగాపురం గ్రామాలు ఉన్నాయి. ఆ వార్డుల్లో సుమారు 800 మంది జనాభా నివసిస్తున్నారు. అలాగే యనమదుర్రు గ్రామం నుంచి కనిపిస్తున్న డ్రెయిన్ ఆవలివైపు ఉన్న గ్రామాల్లో కొంతమందికి రైతులకు పొలాలు ఉన్నాయి. దీంతో రాత్రులు పగలు అనే తారతమ్యం లేకుండా నిరంతరం రాకపోకలు జరుగుతుంటాయి. డేగాపురం నుంచి యనమదుర్రు డ్రెయిన్ ఆవలి వైపు వెళ్లాలంటే భీమవరం నుంచి 14 కిలోమీటర్లు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప నుంచి 8 కిలోమీటర్లు వెళ్లాల్సిందే.

డాక్టర్ వైఎస్సార్ చలవతో వంతెన నిర్మాణాలు

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 16 ఏళ్ల క్రితం ఇక్కడ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

వంతెన నిర్మాణాన్ని రద్దు చేసిన వైనం

2016లో డేగాపురం-యనమదుర్రు గ్రామాల మధ్య యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మిస్తున్న వంతెన పనులు నత్తనడకన సాగడం, ఏళ్లు గడుస్తున్నా 10 శాతం నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో అప్పుడు అధికారంలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) రద్దు చేశారు. దీంతో డేగాపురం, కట్టావారిపాలెం గ్రామస్తులు ఏదైనా సమస్య వస్తే విన్న వించుకోవాలన్నా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోవాలన్నా, భీమవరం మీదుగా యనమదుర్రు గ్రామానికి, అలాగే దిరుసుమర్రు, గొల్లవానితిప్ప మీదుగా 8 కిలోమీటర్లు అటు భీమవరం నుంచి 12 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని వంతెన నిర్మించాలని లేకుంటే సమీపంలో ఉన్న గొల్లవానితిప్ప గ్రామంలో వార్డులను కలపాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



యనమదుర్రు కాలువ వైపు ఊరు ఉండటంతో అక్కడి ప్రజల సమస్యలు పరిష్కరించాలి. గ్రామంలో మాకు ఏదైనా సమస్య వస్తే విన్నవించుకోవాలంటే గొల్లవానితిప్ప మీదుగా 8 కిలోమీటర్లు, భీమవరం మీదుగా 12 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది.

కొప్పాడి సావిత్రి,
వికలాంగురాలు, డేగాపురం

వంతెన నిర్మించాలి



భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో వంతెన నిర్మించాలి. లేకుంటే సమీపంలో ఉన్న గొల్లవానితిప్ప గ్రామంలో మా వార్డులు కలపాలి. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు మా గ్రామాలకు చుట్టం చూపుగా వచ్చి వెళ్లిపోతున్నారు. మా సమస్యను పరిష్కరించాలి.

పిల్లి ఆశీర్వాదం,
6 వార్డు మెంబర్ భర్త, డేగాపురం

ఉపాధి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. గురువారం భీమవరంలో మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు, ఎడ్ల చిట్టిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, శేషపు ఆశ్రయ్య, షేక్ పాదుషా, మూడే మోజేష్, గుబ్బల నాగేశ్వరరావు, పోతుల మృత్యుంజయ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఎస్సీ సర్టిఫికెట్ రద్దు

భీమవరం (ప్రకాశం చౌక్): కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామానికి చెందిన కోనా జోసెఫ్ అనే వ్యక్తికి ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేస్తూ కలెక్టర్ నాగరాణి ఉత్తర్వులు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. క్రిస్టియన్ అయిన జోసెఫ్ ఎస్సీ సర్టిఫికెట్ పొంది అట్రాసిటీ కేసులో ఉపయోగించుకుంటున్నాడని గతేడాది సెప్టెంబర్‌లో ఇప్పటి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారణ చేసిన కలెక్టర్ ఈనెల 1వ తేదీన జోసెఫ్ ఎస్సీ సర్టిఫికెట్‌ను రద్దు చేసి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు.

త్వరలోనే ఆకివీడు- దిగమర్రు బైపాస్ రోడ్డు పనులు ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): త్వరలోనే ఆకివీడు- దిగమర్రు బైపాస్ రోడ్డు పనులు ప్రారంభమవుతాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయక మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ జాతీయ రహదారుల నిర్మాణం గురించి చర్చించామన్నారు. ఇప్పటికే కేంద్రం నుంచి అనుమతి వచ్చిన ఆకివీడు - దిగమర్రు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తాను తీసుకువెళ్లడం జరిగిందని శ్రీనివాస వర్మ ఢిల్లీ నుంచి విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు.

మామిడి పంటపై మంచు ప్రభావం

నరసాపురం రూరల్: మామిడి పంటపై మంచు ప్రభావం అధికంగా ఉంటుందని ఉద్యానవన శాఖ సహాయకురాలు దీప్తి తెలిపారు. గురువారం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో మామిడి తోటలను ఆమె పరిశీలించారు. మామిడికి పూత సీజన్ కావడంతో పలు సస్యరక్షణ సూచనలు, సలహాలను ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచించారు. తామర పురుగులు, తేనె మంచు పురుగు వ్యాపించకుండా ఉండేందుకు రెండు గ్రాముల ఫాస్ఫామిడాన్, రెండు గ్రాముల డైక్లోరోపాస్‌ల మందును రెండు లీటర్ల నీటికి కలిపి నెల రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు చెట్లపై పిచికారి చేయాలని సూచించారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌వి గోపాలన్

భీమవరం(ప్రకాశం చౌక్): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వి గోపాలన్ తెలిపారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గోపాలన్ మాట్లాడారు. మార్చి 8 నుంచి మార్చి 16వ తేదీ వరకు 500 కిలోమీటర్ల ప్రజా చైతన్య జిల్లా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఎండ తీవ్రతతో ప్రజల బెంబేలు



ఎండ వేడిమితో ఆకివీడు ప్రధాన సెంటర్‌లో ఖాళీగా ఉన్న జాతీయ రహదారి

ఆకివీడు: ఎండ తీవ్రత ప్రజలను బెంబేలెత్తించింది. గురువారం ఉదయం నుండే గ్రీష్మ తాపానికి ప్రజలు అల్లాడిపోయారు. మార్చి మొదటి వారంలోనే భానుడు భగ భగలు ప్రజలను కలవరపెడుతున్నాయి. రానున్న రోజుల్లో ఏ విధంగా గడపాలనే భయాందోళనకు గురవుతున్నారు. మండుటెండలకు వృద్ధులు, పిల్లలే కాదు, పెద్దలు కూడా అట్టుడికిపోయారు. ఉదయం 10 గంటలకే ఇళ్లకు చేరుకుని మధ్యాహ్నంమూడు గంటల వరకూ బయటకు రాని పరిస్థితి నెలకొంది.

కొల్లేరులో కిక్కిస దగ్ధం

మండుటెండల్లో మే నెలలో కొల్లేరులో కిక్కిస ఎండిపోవడంతో దగ్ధం చేసేవారు. ఆ ప్రాంతంలో చెరువులు తవ్వేందుకు కిక్కిసకు నిప్పంటించేవారు. అయితే మార్చి నెలలోనే ఎండలు భగ భగ మనడంతో కిక్కిసకు గురువారం నిప్పంటించారు. దీంతో భారీ మంటలు ఎగిసి పడ్డాయి. కిక్కిస మంటల వ్యాప్తికి మాడి మసైపోయిన కిక్కిస రేణువులు గాలిలో కలిసి కిలోమీటర్ల కొద్దీ ఎగిరి సమీపంలోని గ్రామాలను రేణువులు ముంచెత్తాయి. భవనాలపైనా, ఖాళీ ప్రదేశాలు, ఇళ్లపైన, రోడ్ల వెంబడి కిక్కిస మసి రేణువులు ఎగిరిపడ్డాయి. భారీ మంటలకు సమీప గ్రామాల్లో వేడు గాలులు వీచాయి. ఎండ తీవ్రత, వేడి గాలులకు ప్రజలు అట్టుడికిపోయారు. ఇళ్లల్లోనే ఉండి ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల క్రింద కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొల్లేరులో ఓ పక్క సుప్రీం కోర్టు ఆదేశాలతో ప్రభుత్వ భూముల్లోని చెరువులను ధ్వంసం చేస్తుంటే మరో వైపు చెరువుల తవ్వకానికి కిక్కిసను దగ్ధం చేయడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేడిగాడ్పులకు కిక్కిస దగ్ధం కూడా ఒక కారణమని చెబుతున్నారు. కిక్కిస దగ్ధం చేసేవారిపై అభయారణ్య పరిరక్షణ అటవీశాఖ అధికారులు ఎలాంటి కేసులు పెట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రానున్న వేసవిలో కిక్కిస దగ్ధం మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందంటున్నారు. ముందుగానే అటవీశాఖ అధికారులు కిక్కిస దగ్ధం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అతివల పాత్ర కీలకం



సెయింట్ మేరిస్ ఆస్పత్రిలో గుడ్డ సంచులను అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): సమాజ ప్రగతిలో అతివల పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి అన్నారు. జిల్లా సర్వోదయ మండలి, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ మహిళ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా సెయింట్ మేరిస్ ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సులను సత్కరించి గుడ్డ సంచులను ఉచితంగా అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి మాట్లాడుతూ 72 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సెయింట్ మెరిస్ వ్యవస్థలో నర్సులు, డాక్టర్లు అందజేస్తున్న సేవలు అద్వితీయమని, పరిశుభ్రతలో కూడా ఈ ఆస్పత్రి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందన్నారు. ప్లాస్టిక్ వల్లే కలిగే అనర్థాలను రోగులకు వివరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, కడలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ నిర్వహణపై జేసీ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరిగేలా శాఖలు వారీగా కేటాయించిన పనులు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేటు వశిష్టకాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాట్లపై సంబంధిత అధికారులు, పట్టణంలోని వివిధ కళాశాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు పనులు వేగవంతంగా చేయాలన్నారు. మార్చి 8వ తేదీ శనివారం స్థానిక ప్రకాశం చౌక్ నుంచి సుమారు 600 మంది మహిళలు ఫ్యాన్సీ డ్రెస్ తో భారీ ర్యాలీని ప్రారంభించటం జరుగుతుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను, మహిళలను, ప్రముఖులను భాగస్వామ్యం చేసుకుంటూ విజయవంతంగా వేడుకలు జరగాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొనే కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో ప్రత్యక్ష ప్రసారం చేయుటకు, అందరూ తిలకించేందుకు వీలుగా ఎల్ఈడీ వాల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ర్యాలీ సజావుగా సాగుటకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఐసీడీఎస్ అధికారి బి.సుజాతారాణి, డీఆర్డీఏ పీడీ యం.యస్.యస్.వేణుగోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణ శ్రీ, వైద్యఆరోగ్య శాఖ అధికారి డా.బి.భానూనాయక్, జిల్లా లేబరు అధికారి ఏ.లక్ష్మి, వివిధ కళాశాలల ప్రతినిధులు రమేష్ రాజు, మహేష్,రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ధర్నాకు వెళ్లిన ఆశ వర్కర్లు



ధర్నాకు ఆకివీడు నుండి బయలుదేరిన ఆశ వర్కర్లు

ఆకివీడు: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని ఆశ వర్కర్ల సంఘం ప్రతినిధులు తోట పద్మ, వైకుంఠపు రామలక్ష్మి ఆవేదన వ్యక్తంచేశారు. విజయవాడలోని ధర్నా చౌక్(అలంకార్‌థియేటర్) వద్ద గురువారం రాష్ట్ర వ్యాప్త ఆశ వర్కర్ల ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆశ వర్కర్లు విజయవాడ బయలుదేరి వెళ్లుతూ స్థానిక రైల్వే స్టేషన్ వద్ద మాట్లాడుతూ గత తొమ్మిది నెలలుగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుజేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందన్నారు. విజయవాడలో జరిగే భారీ ధర్నాతోనైనా ప్రభుత్వం కళ్లు తెరచి ఆశా వర్కర్ల సమస్యల్ని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ ప్రజలకు మరిన్ని సేవలు



పోస్టుఉమెన్ ఎన్.శిరీషను అభినందిస్తున్న హరికృష్ణ ప్రసాద్

పెనుమంట్ర: గ్రామీణ ప్రజలకు తపాలాశాఖ ద్వారా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ పథకాలను మరింత అందుబాటులోకి తీసుకువచ్చినట్లు భీమవరం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ కె హరికృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం పెనుమంట్ర సబ్ పోస్టాఫీస్ పరిధిలో తపాలా సిబ్బందికి ఖాతాదారులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. తపాలాశాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి తపాలాశాఖ ద్వారా అమలు చేస్తుందని, ప్రతి గ్రామంలో ప్రజలకు, ఖాతాదారులకు తమ ఇంటివద్దనే సేవలు అందించే స్థాయికి తపాలాశాఖను తీర్చిదిద్దామన్నారు. ఈ సందర్భంగా భీమవరం డివిజన్‌లో అధిక మొత్తం బీమా ప్రీమియం సేకరించిన పెనుమంట్ర పోస్టు ఉమెన్ ఎస్.శిరీషను అభినందించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో తిరుపతిలో జరిగే సదస్సులో చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ చేతులు మీదుగా ఉత్తమ పోస్టు ఉమెన్ అవార్డు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భీమవరం డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్(ఆర్) ఎస్ఎస్‌వీఏకే కుమార్, తణుకు సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్య ప్రకాష్, వై.శివ ప్రసాద్, బి.వెంకటేష్, సబ్ పోస్టుమాస్టర్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెల్సన్ రాజు మృతి తీరని లోటు



విశ్రాంత జడ్జి నెల్సన్‌రాజు సంతాప సభలో మాట్లాడుతున్న వక్తలు

భీమవరం(ప్రకాశం చౌక్): ఇటీవల మృతి చెందిన విశ్రాంత జడ్జి ఎస్సీ నెల్సన్ రాజు సేవలు కొనియాడుతూ సంతాప సభ నిర్వహించనున్నట్లు ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం అధ్యక్షుడు కెప్టెన్ ఎ. వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లడుతూ విశ్రాంత జడ్జి నెల్సన్‌రాజు మృతి భీమవరం పట్టణానికి తీరని లోటనీ, వారి కుటుంబ సభ్యులకు వివిధ సంఘాల తరపున ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తూ, అంబేద్కర్ భవన్ అవరణలో మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గూడపాటి శాంతారావు, కాటం స్టాన్లీ, అధ్యక్షుడు తాళ్లూరి మధు, గంట సుందర్ కుమార్, చెల్లుబోయిన రంగారావు, వై.న్యూటన్, డి. కె.వి. ప్రకాష్ ఈ.కృపానందం, కె.విజయ కుమార్, కోరం ముసలయ్య, పి రాజ బాబు, కె. సోమయ్య, పి.అమూల్య రావు, కె. నాగరాజు, పి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఏబీసీ కేంద్రం పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో అతి త్వరలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని ఆర్డీఓ, పట్టణ స్పెషల్ ఆఫీసర్ దాసి రాజు అన్నారు. గురువారం పట్టణంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ పట్టణంలో వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో ఏబిసి కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ. 5 లక్షలు మునిసిపల్ నిధులతో ఈ నిర్మాణం కొనసాగుతుందన్నారు. దాదాపుగా ఎనిమిదేళ్ల క్రితం వెటర్నరీ ఆసుపత్రి వద్ద మునిసిపల్ డ్రెయినేజీ నిర్మాణం జరిగినప్పుడు ఆసుపత్రి ప్రహరీను తొలగించారు. అప్పటి నుండి ఆ ప్రహరీను నిర్మించలేదు. దీనిపై ఆసుపత్రి అధికారులు, స్థానిక నాయకులు దాసి రాజు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రహరీ నిర్మాణానికి అంచనాలు తయారు చేసి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు. అనంతరం రామగుండం పార్కు, రుద్రభూమి, రూరల్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, 28వ వార్డు పైపులైన్ పనులు పరిశీలించారు. ఆర్డీఓ వెంట మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి, వెటర్నరీ డాక్టర్ మల్లేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, జివి తదితరులు ఉన్నారు.

పురుగు మందుల షాపు ప్రారంభం



పురుగు మందుల షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: రైతులకు నాణ్యమైన పురుగు మందులను సరసమైన ధరలకు అందించేందుకు నాబార్డు ఆధ్వర్యంలోని పురుగు మందుల షాపు దోహదపడుతుందని నరసాపురం వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్ కుమారి, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ డిప్యూటీ డైరెక్టర్ ప్రకాష్ అన్నారు. గురువారం నరసాపురం పట్టణంలో జాతీయ 10 వేల రైతు ఉత్పత్తిదారుల పథకం (ఎఫ్‌పీవో)లో భాగంగా పురుగు మందుల షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ ఎఫ్ఏఓ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. కార్యక్రమంలో నరసాపురం రైతు ఉత్పత్తిదారుల సంఘ చైర్మన్ డాక్టర్ ఇలపకుర్తి సూర్య ప్రకాష్, స్టేట్ కోఆర్డినేటర్ సునీల్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్‌లు శివశంకర్, సతీష్, ఈశ్వర బ్రహ్మారెడ్డి, సీఈవో ఫణికుమార్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్

90102 23729
90108 51166

Office mail : tpgadvt@gmail.com

క్లుప్తంగా

దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

భీమవరం(ప్రకాశం చౌక్): దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలని దంత వైద్యులు డా.ఎస్.గౌతమ్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం 32 డెంటల్ హాస్పటల్‌లో ప్రపంచ దంత వైద్య దినోత్సవం సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ మనదేశంలో చాలామంది ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తారని, పలు వ్యాధుల ప్రారంభ సంకేతాలు, లక్షణాలను ముందుగా గుర్తిస్తే అరికట్టవచ్చాన్నారు. దంత సంరక్షణపై నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రస్తుతం దంత వైద్య చికిత్సలో చాలా మార్పులు వచ్చాయని, పుట్టిన పిల్లల నుంచి పెద్ద వారి వరకు దంత సమస్యలు అధికమవుతున్నాయని అన్నారు. అనంతరం 22 మందికి ఉచిత దంత వైద్య పరీక్షలను నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.

పీ-4 సర్వేపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ వి.రెడ్డియ్య

పాలకోడేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో త్వరలో చేపట్టబోయే పీ-4సర్వేపై సచివాలయ కార్యదర్శులకు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో వి.రెడ్డియ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణ అనంతరం ఈ నెల 8 నుంచి మండలంలోని 18 గ్రామ సచివాలయాలలో పీ-4 సర్వే నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా మొదటిరోజు 80 మంది సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించామని, రెండో రోజు శుక్రవారం మరో 72 మందికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



ఆలయ అర్చకులకు బంగారం అందజేస్తున్న బాలజీ రాజు కుటుంబం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి గురువారం కోలమూరుకు చెందిన కూనపరాజు బాలాజీ రాజు దంపతులు 7 గ్రాముల బంగారం సమర్పించారు. అలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వారికి శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని నౌడూరు గ్రామంలో సంతోషిమాత నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సం గురువారం ఘనంగా నిర్వహించారు. అడబాల బాబులు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. జై సంతోషిమాత-జై జై సంతోషిమాత అంటూ ఆలయ ప్రాంగణమంతా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఇంటికి వచ్చి దౌర్జన్యం చేశాడని పోలీసులకు ఫిర్యాదు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరానికి చెందిన ఎం. మహేంద్ర అనే వ్యక్తి తనపై దౌర్జన్యం చేశాడని రాయలంకు చెందిన ఒక మహిళ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూ టౌన్ ఎస్సై రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం రాయలంలో నివాసం ఉంటున్న తోరం పరుశురాం, మహేంద్రకు ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో జనవరి 27 తారీఖున పరుశురాం లేని సమయంలో అతని ఇంటికి వెళ్లి అతని భార్య శిరీషను దూషించి డబ్బుల కోసం దౌర్జన్యం చేశాడని శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రెహమాన్ తెలిపారు.

దళితుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

పెనుగొండ: దళితవాడల్లో పెరిగిపోతున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళిత సమస్యలపై, దళితుల ఆర్థిక స్థితిగతులపై దళిత ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో గళమెత్తి వారి సమస్యలను తీర్చేలా చర్చ చేయాలని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నూరు శాతం ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.